'గేమ్‌ఛేంజర్' పూర్తయ్యాకే..

రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' వైజాగ్ షెడ్యూల్ నిన్నటితో పూర్తయినట్టు విశ్వసనీయ సమాచారం. తదుపరి షెడ్యూల్ ఎప్పుడన్నది త్వరలో ప్రకటించనున్నారు దర్శకుడు శంకర్. ఇదిలావుంటే.. బుధవారం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టార్ హోటల్‌లో రామ్‌చరణ్, బిచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమాకు సంబంధించిన పూజాకార్యక్రమం లాంఛనంగా జరుగనుందని తెలుస్తున్నది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకటసతీశ్ కిలారు నిర్మించనున్న ఈ సినిమాకు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. విజయ్‌సేతుపతి విలన్‌గా నటిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఈ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్ మొత్తం దర్శకుడు బుచ్చిబాబు పూర్తి చేశారు. ఉత్తరాంధ్రకు చెందిన నటీనటుల కోసం ఆడిషన్స్ కూడా నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే.. 'గేమ్‌ఛేంజర్' షూటింగ్ పూర్తి అయిన తర్వాతే ఈ సినిమా షూటింగ్ మొద

సాహస యాత్రకు సిద్ధం

రాజమౌళి దర్శకత్వంలో మహేష్‌బాబు కథానాయకుడిగా ఆఫ్రికన్ జంగిల్ అడ్వెంచర్ నేపథ్యంలో పాన్ వరల్డ్ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఎప్పుడు సెట్స్‌మీదకు వెళ్తుందోనని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల జపాన్‌లో అక్కడి ప్రేక్షకులతో కలిసి 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాన్ని వీక్షించిన రాజమౌళి స్థానిక మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌ను అందించారు. మహేష్‌బాబు చక్కటి ప్రతిభ కలిగిన నటుడని, హ్యాండ్సమ్‌గా ఉంటాడని రాజమౌళి కితాబిచ్చాడు. 'మహేష్‌బాబుతో సినిమా చేయబోతున్నా. మీకు కూడా ఆయన గురించి తెలిసే ఉంటుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలో షూటింగ్‌ను ప్రారంభించి, సాధ్యమైనంత వేగంగా చిత్రాన్ని పూర్తి చేయాలనుకుంటున్నాం' అని రాజమౌళి తెలిపారు. తాజా అప్‌డేట్‌తో అభిమానులు సంబరపడిపోతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం మే నెలలో ఈ సినిమాను సెట్స్‌మీదకు తీసుకురానున్నారని తెలిసింది. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం గత ఏడాది జపాన్‌లో విడుదలైంది. అక్కడ కూడా ప్రేక్షకులు అద్భుతమైన ఆదరణ కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో అభిమానులను కలిసేందుకు రాజమౌళి ఇటీవల జపాన్‌కు వెళ్లారు.

పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' టీజర్‌ని మంగళవారం మేకర్స్ విడుదల చేశారు. పోలీస్ గెటప్‌లో 'గబ్బర్‌సింగ్'ని తలపించేలా 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఉన్నాడని పలువురు అభిప్రాయపడుతున్నారు.

'గాజు పగిలేకొద్దీ పదునెక్కుద్ది.. గ్లాసంటే సైజు కాదు.. సైన్యం.. కనిపించని సైన్యం..' అనే డైలాగ్ పవన్‌కల్యాణ్ పొలిటికల్ కెరీర్‌ని దృష్టిలోపెట్టుకొని రాసినట్టుగా ఉంది. పవన్‌కల్యాణ్ పాత్రను. స్టైలిష్‌గా, అత్యంత శక్తిమంతంగా దర్శకుడు హరీష్‌శంకర్ డిజైన్ చేసినట్టు టీజర్ చెప్పకనే చెబుతున్నది. పవన్ పవర్‌పుల్ పంచ్ డైలాగులు, పవన్ గన్స్ ఫైర్ చేయడం టీజర్‌లో హైలైట్స్ అని మేకర్స్ చెబుతున్నారు. శ్రీలీల కూడా టీజర్‌లో కనిపిస్తున్నది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ సినిమాలో అశుతోష్ రానా, నవాబ్‌షా, కేజీఎఫ్ అనినాష్, గౌతమి, నర్రా శ్రీను, నాగమహేశ్, టెంపర్ వంశీ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, నిర్మాతలు: నవీన్ యెర్నని, వై.రవిశంకర్, నిర్మాణం: మైత్రీమూవీమేకర్స్.

గోల్డెన్‌ఛాన్స్ కొట్టేసింది

త్రిష కెరీర్ మొదలుపెట్టినప్పుడు పుట్టిన అమ్మాయిలు ఇప్పుడు హీరోయిన్లు. కానీ త్రిష ఇప్పటికీ హీరోయినే. అంతేకాదు, స్టార్ హీరోలతో జతకడుతూ కొత్తమ్మాయిలకు సవాలు విసురుతున్నది ఈ చెన్నయ్ చందమామ. 'విశ్వంభర' సినిమాలో మెగాస్టార్ చిరంజీవితో జతకట్టిన త్రిష, తాజాగా మరో గోల్డెన్‌ఛాన్స్ కొట్టేసింది. తమిళ అగ్ర హీరో విజయ్ తాజా చిత్రం 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'(గోట్) చిత్రంలో కథానాయికగా ఛాన్స్ కొట్టేసింది త్రిష. ఇందులో విజయ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. యంగ్ విజయ్‌కి జోడీగా మీనాక్షి చౌదరి నటిస్తున్నది. తండ్రి పాత్రకు జోడీగా ముందు అనుష్కను అనుకున్నారు. అయితే, ఆ పాత్రకు స్వీటీ 'నో' చెప్పడంతో చివరికి బంతి త్రిష గోల్‌కి వచ్చి చేరింది. తమిళనాట విజయ్, త్రిష సూపర్‌హిట్ కాంబినేషన్. వారిద్దరి కలయికలో వచ్చిన ఆది, గిల్లీ, తిరుపాచ్చి, కురువి చిత్రాలు బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. రీసెంట్‌గా 'లియో'తో ఈ జంట హిట్ అందుకుంది. అందుకే కలిసొచ్చిన కాంబినేషన్ మిస్ చేసుకోకూడదనుకుందో ఏమో.. తండ్రి పాత్ర చేస్తున్న విజయ్‌తో జతకట్టడానికి ఓకే అనేసింది త్రిష. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇదే గాక, కమల్‌హాసన్, మణిరత్నంల 'థగ్‌లైఫ్', అజిత్‌తో 'విడాముయర్చి' చిత్రాల్లో కూడా త్రిష నటిస్తున్న విషయం తెలిసిందే.

హాలీవుడ్ స్థాయిలో కంగువ

ఫిక్షన్‌తో కూడిన అడ్వెంచరస్ మూవీల కాలం నడుస్తుందిప్పుడు. ముఖ్యంగా తెలుగులో ఆ తరహా సినిమాలకు మంచి డిమాండ్ ఉంది. తాజాగా తమిళ అగ్రహీరో సూర్య చేస్తున్న 'కంగువ' చిత్రం అలాంటి సినిమానే. ఇందులో సూర్య పోరాట యోధునిగా కనిపించనున్నాడు. ఇటీవల విడుదలైన టీజర్‌లో పులితో సూర్య చేసిన విన్యాసాలు, గుర్రపు స్వారీలూ, భయంకరమైన భారీ యుద్ధ సన్నివేశాలు హాలీవుడ్ ఎపిక్ వార్ మూవీస్‌ని గుర్తు చేస్తున్నాయని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాకోసం హీరో సూర్య పడిన శ్రమ, పాత్రకోసం ఆయన మారిన తీరు, 'కంగువ' పాత్రలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రానికి శివ దర్శకుడు. దిశాపటానీ. బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టూడియోగ్రీన్, యూవీ క్రియేషన్స్ పతాకాలపై కేఈ జ్ఞానవేల్‌రాజా, వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. పది భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రం త్రీడీలో కూడారానుంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిస్వామి, సంగీతం: దేవిశ్రీప్రసాద్.

డీజే టిల్లుని మించేలా..

'డీజే టిల్లు రిలీజ్ సమయంలో సినిమాపై అంతగా అంచనాలు లేవు. అందుకే టీమ్ అంతా ఎలాంటి ఒత్తిడి లేకుండా పని చేశాం. కానీ 'టిల్లు స్క్వేర్' పై మాత్రం ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. దాంతో మాపై బాధ్యత పెరిగింది. అందరం కలిసి గొప్ప చిత్రాన్ని అందించేందుకు ప్రయత్నించాం. తప్పకుండా ఈ సినిమా మీ అంచనాలను అందుకుంటుంది' అన్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా మల్లిక్ రామ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న 'టిల్లు స్క్వేర్' చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించింది. ఈ సినిమాలోని 'ఓ మై లిల్లీ' అనే పాటను సోమవారం విడుదల చేశారు. అచ్చు రాజమణి స్వర పరచిన ఈ పాటను శ్రీరామ్‌చంద్ర ఆలపించారు. సిద్ధు, రవి ఆంథోని రచించారు. ఈ సందర్భంగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'వేసవి సీజన్‌లో తొలి చిత్రం కాబట్టి మాకు కలిసొస్తుందనే నమ్మకం ఉంది. ఈ సినిమాలో యువతతో పాటు ఫ్యామిలీ ప్రేక్షకుల్ని అలరించే అన్ని అంశాలుంటాయి. ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది' అన్నారు. ఈ సినిమా రిలీజ్ కోసం తాను కూడా ఆతృతగా ఎదురుచూస్తున్నానని కథానాయిక అనుపమ పరమేశ్వరన్ చెప్పింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు ఈ చిత్రాన్ని తెరకెక్కించాయి.

వేసవిలో వినోదాల హంగామా

శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీహర్ష కొనుగంటి దర్శకుడు. యువీ క్రియేషన్స్, వీ సెల్యూలాయిడ్ సంస్థలు నిర్మించాయి. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. 'యు.ఏ' సర్టిఫికెట్ లభించింది. దర్శకుడు మాట్లాడుతూ 'భిన్న మనస్తత్వాలు, అభిరుచులు కలిగిన ముగ్గురు మిత్రుల కథ ఇది. వారు భైరవపురంలో అనే గ్రామంలో చేసే హంగామా ఏమిటన్నదే ఈ చిత్ర కథాంశం. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది. రెండున్నర గంటల పాటు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. వినూత్న కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం క్లైమాక్స్‌లో ఊహించని మలుపులుంటాయి' అన్నారు. యువతతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ మెచ్చే కథాంశమిదని, ఓవర్సీస్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో 21వ తేదీన ప్రీమియర్లను ప్రదర్శిస్తున్నామని నిర్మాతలు తెలిపారు.

సమంత వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ-బన్నీ'

'ఫ్యామిలీమెన్-2' సిరీస్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువైంది అగ్ర కథానాయిక సమంత. నెగెటివ్ షేడ్స్ కలిగిన రోల్‌లో ఆమె నటన అందరిని ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో ఆమె వరుణ్‌ధావన్‌తో కలిసి నటిస్తున్న తాజా సిరీస్ 'సిటాడెల్' అంచనాలను పెంచుతున్నది. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్ చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. హాలీవుడ్ 'సిటాడెల్' సిరీస్‌కు ఇండియన్ వెర్షన్‌గా తెరకెక్కుతున్న ఈ సిరీస్‌కు 'సిటాడెల్: హనీ-బన్నీ' అనే పేరును ఖరారు చేశారు. ముంబయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ టైటిల్‌ను ప్రకటించారు. ఈ సిరీస్ కోసం సమంత మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంది. డూప్ లేకుండా పలు పోరాట ఘట్టాల్లో నటించింది. 1990 నేపథ్యంలో ఈ సిరీస్ కథ నడుస్తుందని తెలిసింది.

తెలుగులో రెండు సినిమాలు

'పుష్ప' చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు మలయాళ అగ్ర నటుడు ఫహద్ ఫాజిల్. పోలీస్ ఆఫీసర్ బన్వర్‌సింగ్ షెకావత్ పాత్రలో ఆయన అందరికి గుర్తుండిపోయింది. 'పుష్ప' సీక్వెల్‌లో కూడా ఆయన పాత్ర కీలకంగా ఉండబోతున్నది. ఈ నేపథ్యంలో ఫహద్ ఫాజిల్ తెలుగులో రెండు కొత్త చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అగ్ర దర్శకుడు రాజమౌళి తనయుడు కార్తికేయ నిర్మిస్తున్న 'ఆక్సిజన్' 'డోంట్ ట్రబుల్' చిత్రాల్లో ఫహద్ ఫాజిల్ ముఖ్య పాత్రలను పోషించనున్నారు. అర్కా మీడియాతో కలిసి కార్తికేయ ఈ సినిమాలను తెరకెక్కించబోతున్నారు. స్నేహం ప్రధానంగా రూపొందించన్న 'ఆక్సిజన్' చిత్రం ద్వారా సిద్ధార్థ్ నాదేళ్ల దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. థ్రిల్లింగ్ ఫాంటసీ కథాంశంతో తీయబోతున్న 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' చిత్రానికి శశాంక్ ఏలేటి దర్శకత్వం వహిస్తారు. ఈ రెండు కథలు వినగానే ఫహద్ ఫాజిల్ వెంటనే అంగీకరించారని, ఆయన బహుముఖ ప్రజ్ఞకు ప్రతిరూపమని కార్తికేయ ప్రశంసించారు.

నల్లమల ఫారెస్ట్ నేపథ్యంలో..

విశ్వకార్తికేయ, ఆయూషి పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వర్ రెడ్డి నిర్మాతలు. ఈ నెల 29న విడుదకానుంది. సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. లవ్, క్రైమ్, థ్రిల్లర్ అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. నల్లమల ఫారెస్ట్ నేపథ్యంలో థ్రిల్లింగ్ అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. క్రైమ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఆద్యంతం అనూహ్య మలుపులతో ఉత్కంఠను పంచుతుందని దర్శకుడు తెలిపారు. సినిమా షూటింగ్ మొత్తం కడప పట్టణంలో జరిపామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: చరణ్ మాధవనేని, సంగీతం: అజయ్ అరసాడ, దర్శకుడు: రమాకాంత్ రెడ్డి.

కారుణ్య మరణం కోసం..

సాయికుమార్, పార్వతీశం, ఐశ్వర్య, హారిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మెర్సి కిల్లింగ్'. వెంకటరమణ ఎస్ దర్శకుడు. మాధవి తాలబత్తుల నిర్మాత. ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను యువ హీరో ఆకాష్ పూరి విడుదల చేశారు. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం విజయం సాధించాలని ఆకాష్ పూరి ఆకాంక్షించారు. దర్శకుడు మాట్లాడుతూ 'భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. స్వేచ్ఛ అనే అనాథ బాలిక న్యాయ పోరాటం నేపథ్యంలో కథ నడుస్తుంది' అని అన్నారు. రామరాజు, సూర్య, ఆనంద్ చక్రపాణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అమర్.జి, సంగీతం: ఎం.ఎల్.రాజా, దర్శకత్వం: వెంకటరమణ.ఎస్.

భావోద్వేగాల మేళవింపుగా

ఈ రోజుల్లో స్త్రీలు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేస్తూ, విలువైన సమాచారంతో పాటు కుటుంబ భావోద్వేగాల మేళవింపుగా రూపొందుతోన్న చిత్రం 'టెనెంట్'. 'పొలిమేర-2'తో హిట్ అందుకున్న సత్యం రాజేశ్ ఇందులో హీరో. వై.యుగంధర్ దర్శకుడు. మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ మూడో వారంలో సినిమాను విడుదల చేయడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. మేఘాచౌదరి, చందన పయావుల, భరత్ కాంత్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జెమిన్‌జోమ్ అయ్యనేత్, సంగీతం: సాహిత్య సాగర్.